క్లుప్తంగా

క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన గేట్స్ విద్యార్థులు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీ ఫనెల్ ప్రతినిధులు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఎంబీఏ ఫైనలియర్ చదువుతున్న రుచిత, ప్రేమ్ స్వరూప్, భార్గవి, కీర్తన, ప్రియాంక, సరిత, ప్రింక, హేమలత డేటా అనలిటిక్స్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సూరయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్ అభినందించారు.

నేహా నగర్‌లో చోరీ

గుత్తి: పట్టణంలోని నేహా నగర్ నివాసముండే ఈశ్వర్‌రెడ్డి ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. దొంగలు బీరువాలో దాచి ఉంచిన రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 21 వేల నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంఈఎఫ్ కమిటీ ఏకగ్రీవం



ఎంఈఎఫ్ నూతన కమిటీ సభ్యులు

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సోమవారం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బండారు శంకర్, సునీత సమక్షంలో నూతన కమిటీ ఎన్నికయింది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా కుళ్లాయి, అధ్యక్షుడిగా రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా ఆదినారాయణ ఎన్నికయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సూచనలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని డీఎస్పీ నరసింగప్ప సూచించారు. సోమవారం సాయంత్రం సీఐలు, ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బందితో కలసి ఆయన మెయిన్‌రోడ్డులో వాహనదారులు, పాదచారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఫుట్‌పాత్‌లపై అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేసిన వారికి ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. మైనర్ పిల్లలకు ద్విచక్రవాహనాలిచ్చి పంపడం చట్టరీత్యానేరమని, నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేసినా, త్రిబుల్ రైడింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, ఆటో సీరియల్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

యాడికి సీఐగా శంకర్‌రెడ్డి



పెద్దవడుగూరు: యాడికి సర్కిల్ సీఐగా పి.శంకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పెద్దవడుగూరు ఎస్ఐగా విధులు నిర్వహించారు. అనంతపురం ఏసీబీలో సీఐగా విధులు నిర్వహించి యాడికికి బదిలీ అయ్యారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకరావాలని సీఐ సూచించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డు పరిధిలోని పోరాట కాలనీలో సోమవారం సాయంత్రం జన చైతన్య యాత్ర జరిగింది. వార్డు నాయకులు వరదలయ్య, ప్రసాద్, బషీర్, రామకృష్ణ, కిట్టుతో కలసి హర్షవర్ధన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత సచివాలయ వార్డు సెక్రటరీలు, వలంటీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, బాబా, జావీద్, లక్ష్మీరంగయ్య, కేశవరెడ్డి, లక్ష్మీనారాయణ, అన్వర్, మనోజ్‌కాశీ పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి. చిత్రంలో ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చైర్‌పర్సన్ భవానీ తదితరులు

- వలంటీర్లను సన్మానించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్‌పర్సన్

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లే సంక్షేమ వారధులని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సోమవారం శింగనమలలోని వాసవీ కల్యాణ మండపంలో మండలంలోని 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థతో కుల, మత, రాజకీయ పార్టీ తారతమ్యం లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు నేరుగా పథకాలు అందుతున్నాయని, ప్రజలు సంతోషంగా ఉంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్వలేక పోతున్నారన్నారు.

టీడీపీ వారికే సంక్షేమ పథకాలు వర్తింపు..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ చెప్పిన వారికే అందించారని, అర్హత ఉన్నా పథకాలు అందలేదని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. తాము ఇళ్ల ముంగిటకే సంక్షేమ అందిస్తుంటే.. ఓర్వలేక టీడీపీ నాయకులు వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేస్తున్నారన్నారు. వలంటీర్లు సేవాభావంతో పని చేస్తున్నారన్నారు. వలంటీర్లు మరింత బాగా పని చేసి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులకు పేరు తీసుకురావాలని తెలిపారు. సేవాభావంతో పనిచేసిన వలంటీర్లను సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్రలుగా ఎంపిక చేసి, వారిని ప్రోత్సహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు అందుతున్న సేవలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. అనంతరం సేవా వజ్రా అవార్డు గెలుపొందిన వరికూటి నాగేంద్ర (వెస్ట్ నరసాపురం), సేవా రత్నలు అనిల్‌కుమార్ (శింగనమల), మధు (కల్లుమడి), ఓబులమూర్తి (తరిమెల), నాగేంద్ర (వెస్ట్ నరసాపురం), వెంకట శివారెడ్డి (ఉల్లికల్లు) లను సన్మానించారు. సేవా మిత్రలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీలు నరసింహులు, విజయ, ఎంపీటీసీ ఉమ, సర్పంచులు నాగమునెమ్మ, ఆదినారాయణ, వెంకట్రాముడు, సరోజమ్మ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నరసయ్య, నాయకులు బండి లలిత కళ్యాణి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలను అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్న వార్డు, గ్రామ వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సరోజినాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. 26 వార్డులకు సంబంధించి వలంటీర్ సి.భారతిని సేవావజ్ర, వలంటీర్ మహబూబ్‌బాషాను సేవారత్న, మిగతావారిని సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్నారన్నారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని మరి రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేందుకు ఆయా ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతి ఒక్కరూ జగనన్నకు తోడుగా నిలవాలన్నారు. సీఎం జగన్ తమకు ప్రజా సేవ చేయడానికి అవకాశం కల్పించడమే కాకుండా తమ సేవలను గుర్తించి ఏటా నగదు ప్రోత్సాహకాలతో తమను సన్మానించడం చాలా సంతోషంగా ఉందని వలంటీర్లు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, మాజీ చైర్మన్ రామలింగప్ప, మెప్మా టీపీఆర్ఓ మోహన్, వార్డు సచివాలయాల కన్వీనర్లు జింకల రామాంజనేయులు, ఖలీల్, కౌన్సిలర్లు ప్రభాకర్, భాస్కర్, చెన్నమ్మ, కుమారి, రంగమ్మ, లింగన్న, రవీంద్ర, కోఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు ఎద్దుల శంకర్, వెంకటేష్, శేఖర్, యూనస్, గోపి, హరినాథ్‌రెడ్డి, ఎల్లప్ప , పార్టీ నాయకలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులకు సత్కారం



యాడికి: పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో అతిథులు

యాడికి: వలంటీర్లు సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్నారని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు అన్నారు. సోమవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. యాడికి మేజర్ పంచాయతీకి చెందిన నలుగురికి సేవారత్న, 124 మందికి సేవామిత్ర పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో వలంటీర్లకు సముచిత గౌరవం లభిస్తోందన్నారు. గత నాలుగేళ్లలో వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి వారి కోసం ప్రభుత్వం రూ.800 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచు అనూరాధా, ఎంపీటీసీలు రామాంజనమ్మ, వెంకటనాయుడు, వార్డు సభ్యుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్లు



సి.వెంగన్నపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. సోమవారం మండలంలోని గోపురాజుపల్లి, సి.వెంగన్నపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం మంచి చేస్తే అదే మనల్ని కాపాడుతుందని జగనన్న నిత్యం చెబుతుంటారన్నారు. అందుకే ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం జగనన్న ఆహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని దుష్టచతుష్టయం అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు విమర్శించారు. విద్యా వ్యవస్థలో జగనన్న తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో పేద విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే అవకాశం ఏర్పడిందన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు.అధికారం దక్కించుకోవడమే ధ్యేయంగా ఎన్ని పార్టీలు కలిసినా, ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నకే ప్రజల మద్దతు ఉందన్నారు. అనంతరం గ్రామంలోని గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు రవి, చంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఓబిలేసు, నాయకులు మడుగుపల్లి నాగేశ్వర్‌రెడ్డి, కేశవ, లక్ష్మీనారాయణ రెడ్డి, దస్తగిరి, గోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గుంతకల్లుటౌన్/శింగనమల: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి సూచించారు. సోమవారం గుంతకల్లు పట్టణంలోని పాతగుత్తి రోడ్‌లోని మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి మాట్లాడుతూ చిన్నవయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన చర్యల గురించి వివరించారు. తల్లిదండ్రి కోల్పోయిన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య ద్వారా జరిగే మేలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీదేవి, పుష్పావతి, సాజిద, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ బాలాజీ, కార్యకర్తలు, హెల్పర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. అలాగే శింగనమలలోని సీడీపీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ యోగేశ్వరి మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు వచ్చిన తరువాతే వివాహాలు జరిపించాలన్నారు. ఎంపీడీఓ నిర్మలాకుమారి , సీడీపీఓ ఉమాశంకరమ్మ , ఏఎస్ఐ చితంబరయ్య, ఎంఈఓ నరసింహరాజు, ఏపీఎం పాల్గొన్నారు.

పాదయాత్రకు నీరా'జనం'



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- నియోజకవర్గంలో సంక్షేమ కాంతులు విరబూయాలి
- ప్రజా సంక్షేమ యాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలో సంక్షేమ కాంతులు విరబూయాలన్నదే తన కోరిక అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా 7వ రోజు సోమవారం మండలంలోని హుసేనాపురం, బొందలదిన్నె, వంగనూరు గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యేతో కలసి నడిచారు. మొదటగా హుసేనాపురం గ్రామంలో పాదయాత్ర చేపట్టారు. అనంతరం గ్రామం నుంచి కడప రోడ్డుకు చేరుకున్న ఆయన అక్కడ నుంచి బొందలదిన్నె వరకూ తాడిపత్రి–కడప రహదారిపై పాదయాత్ర కొనసాగించారు. రహదారిపై వెళ్లే వాహనాల్లోని ప్రయాణికులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి జేజేలు పలికారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యేకు పూలమాలలు వేశారు.

జగనన్నతోనే రాష్ట్రానికి మేలు

సచివాలయ, వలంటర్ వ్యవస్థను తీసుకొచ్చి, ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలను కోరారు. నియోజకవర్గంలో గతంలో పాలించిన నాయకులు దాదాపు 35 సంవత్సరాలు ప్రజల బాగు కోసం ఏం చేశారో మీకే తెలుసన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక, తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి అభివృద్ధి పనులు జోరుగా సాగాయన్నారు.

ఉత్తమ వలంటీర్లకు అవార్డుల ప్రదానం

నియోజకవర్గంలో సేవా మిత్ర, సేవా వజ్ర, సేవా రత్నలకు ఎంపికైన వలంటీర్లకు ఎమ్మెలే కేతిరెడ్డి పెద్దారెడ్డి అవార్డులను ప్రదానం చేశారు. ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా హుసేనాపురం, బొందలదిన్నె, వంగనూరు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలసి అవార్డులను అందజేశారు. మండల వ్యాప్తంగా 275 మందికి సేవా మిత్ర, సేవా వజ్ర 1, సేవా రత్నకు ఐదుగురు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, సర్పంచులు హుసేనాపురం నాగరత్న, బొందలదిన్నె పురుషోత్తం రెడ్డి, వంగనూరు సర్పంచ్ అరుణ, జెడ్పీటీసీ రమణమ్మ, బొందలదిన్నె ఉప సర్పంచ్ ఎం వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వరి, వాల్మీకీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, నాయకులు మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, కాకర్ల రంగనాథ, కాకర్ల బ్రదర్స్, కోట పుల్లారెడ్డి, జి రాజశేఖర్‌రెడ్డి, జేసీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద విద్యార్థికీ ఉన్నత విద్య



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: ప్రతి పేద విద్యార్థికీ ఉన్నత విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మండల జెడ్పీటీసీ భాస్కర్ ఆధ్వర్యంలో 'పది'లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ హాజరయ్యారు. ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే విధంగా ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. టెన్త్ ఫలితాల్లో కార్పొరేట్ స్కూళ్లకంటే అత్యధిక మార్కులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించారన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగనన్న ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన సోపానాలు



మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య. చిత్రంలో ఆలూరి సాంబశివారెడ్డి, గిరిజమ్మ, పైలా నరసింహయ్య, ఉమ

బుక్కరాయసముద్రం: గ్రంథాలయాలు విజ్ఞానానికి సోపానాలు అని అనంతపురం పార్లమెంట్ సభ్యులు తలారి రంగయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక గాంధీనగర్ కాలనీలో పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీ రంగయ్య, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ ఉమ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీ రంగయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ మహిళా కార్యదర్శి మనేరి కొండమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ విజయ భాస్కర్, జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి రమ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, వార్డు మెంబర్ ప్రసాద్, గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

బుక్కరాయసముద్రం: విద్యార్థులు వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఉమ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను పరిశీలించారు.కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ, గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్యే సానుకూల స్పందన

పామిడి: గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డికి సోమవారం పామిడి సీఎస్ఐ చర్చీ సభ్యులు తమ సమస్యలను విన్నవించారు. చర్చి వద్ద గల స్థల సమస్య విషయంలో ఆయన సానుకూలంగా స్పందించారు. అన్నివర్గాల ప్రజల ఆరాధనకు నిలయమైన చర్చికి ఆ స్థలం మీదెగా రస్తా ఏర్పాటుకు ప్రభుత్వం తరపున శాశ్వత పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీనిపై చర్చీ సభ్యులు ఎమ్మెల్యే వైవీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు.

పర్యావరణంపై అవగాహన

గుత్తి: పట్టణ శివారులోని కర్నూల్ రోడ్డులో గుత్తి కోట రైల్వే స్టేషన్ వద్ద సోమవారం తాడిపత్రి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫ్లారెన్స్ దీపా ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు ఎంఈఓ రాముడు, ఎన్జీఓ మాజీ అధ్యక్షులు మల్లికార్జున, శ్రీధర్ గౌడ్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు, యువజన సమితి నాయకులు దేవేంద్ర రాయల్, చిరంజీవి, బలిజ సంఘం నాయకుడు శ్రీకాంత్, ఆటో యూనియన్ నాయకులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

వేలిముద్రలు అప్‌డేట్ చేసుకోండి

యల్లనూరు: మండలంలోని యండీయూ వాహనాల డ్రైవర్లు, రేషన్‌కార్డుదారులు జిల్లా కేంద్రంలోని ఆర్టీఓ కార్యాలయం వద్ద మంగళవారం అప్‌డేట్ చేయించుకోవాలని రెవెన్యూ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

గుత్తి/రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు.

పుట్లూరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, మండల ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని అనిమిరెడ్డి ఫ్యాక్టరీలో మంగళవారం ఉదయం 11 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గుంతకల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సోమవారం తెలిపింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం'

పుట్లూరు: మండలంలోని బాలాపురం, పి.చింతలపల్లి గ్రామాల్లో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు.

రోడ్డు, డ్రైనేజీ పనుల పర్యవేక్షణ

గుత్తి: పట్టణంలోని 23వ వార్డులో రూ. 4 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్ పర్సన్లు పద్మలత, వరలక్ష్మి పర్యవేక్షించారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

588 సంఘాలకు ఆసరా నగదు జమ

యల్లనూరు: మండలంలోని 558 సంఘాలకు గాను 5,882 మంది సభ్యులకు శనివారం ఆసరా ఐదు కోట్లా 99 లక్షల రూపాయలు జమ అయ్యిందని ఏపీఎం ముత్యాలప్ప తెలిపారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు సంఘాల ఖాతాలో జమ చేశారన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని కొజ్జేపల్లిలో వివాహిత మౌనిక సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కొన్ని రోజులుగా ఆమె కుటుంబ సమస్యలతో బాధపడుతుండేది. మనస్థానం చెందిన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను కుటుంబసభ్యులు వెంట గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజా సంక్షేమ యాత్ర

తాడిపత్రి టౌన్: 3వ విడత ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం ఉదయం వంగనూరు, కొండేపల్లి, జంబులపాడు, చల్లవారిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాదయాత్ర చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో అనారోగ్య సమస్యలతో నాగేశ్వరరావు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాగేశ్వరరావు గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రులలో చికిత్స చేయించుకున్నప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో మనస్థాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని స మయంలో విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అ నంతపురం తరలించారు.

సజావుగా వేలం

తాడిపత్రి టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం దిన కూరగాయల మార్కెటు, రోడ్డు మార్జిన్, సైకిల్స్ స్టాండ్, వార పశువుల సంతకు వేలంపాట నిర్వహించారు. మొత్తం మున్సిపాలిటీకి రూ 31.99 లక్షల ఆదాయం సమకూరినట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ శేషన్న తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరీబాయి, డీఈ వెంకట సుబ్బయ్య, ఆర్ఐ రవికిరణ్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పైరు దగ్ధం

పుట్లూరు: నాయకునిపల్లి గ్రామానికి చెందిన శ్రీనాథ్‌రెడ్డి అనే రైతుకు చెందిన 1.30 ఎకరంలో మొక్కజొన్న పంట సోమవారం ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి, కాలిపోయింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని పి.కొండాపురం గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద యక్కలూరు గ్రామానికి చెందిన యేసయ్య అనే ట్రాక్టరు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతిగా మద్యం సేవించి ట్రాక్టర్ నడపడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. యేసయ్యను చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

లచ్చానుపల్లిలో కుప్పకూలి వ్యక్తి మృతి

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి సోమవారం వీరభద్రయ్య(45) అనే వ్యక్తి ఉన్నఫలంగా కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. సోమ వారం మ ధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు నడుచుకుంటూ వెళ్లిన వీరభద్రయ్య ఒక్కసారిగా కుప్పకూలాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.